# కర్మభూమి

పశ్చిమ గోదావరి జిల్లా పదహారణాల తెలుగు ప్రాంతం. అక్కడి వాళ్ళు అసలైన తెలుగువాళ్ళు. ఆ తెలుగువాళ్ళలో ఒకడు శాస్త్రి. చాలా మంది తెలుగు వాళ్ళలాగే అతనికీ, తనకు అటుపక్క, ఇటుపక్క ఉన్న ఇళ్ళలో ఎప్పుడేమి జరిగిందో, వెంటనే గ్రహించేసే శక్తి ఉంది. అలాంటప్పుడు అటుపక్క ఇంట్లో ఉంటున్న మాధవరావుది ప్రేమ వివాహం అనీ, అందుకు సాయం అతనిభార్య హిందువు కూడా కాక యూరోపియన్ అనీ, శాస్త్రి గ్రహించటంలో పెద్ద ఆశ్చర్యమేమి లేదు.

అసలు ప్రేమవివాహం అంటేనే కాస్త సరదాగా ఉంటుంది. ఆ దంపతులను మరి కాస్త గమనించ బుద్ధి వేస్తుంది. వాళ్లు అన్యోన్యంగా ఉన్నా, లేక గుద్దులాడుకున్నా, రెండూ విశేషంగానే అనిపిస్తాయి. దానికి తోడు ఆవిడ యూరోపియన్. మంచి ఎండాకాలంలో కిటికీలన్నీ మూసిన మూలగదిలో ఉన్నట్లు ఉడికిపోయాడు శాస్త్రి. అతని కళ్ళూ, మనసూ, చెవులూ, అటుపక్క ఇంటిమీదే కేంద్రీకరించబడ్డాయి.

త్వరలోనే, ఆవిడ పేరు మిరాండా అని తెలిసింది. ఇంకో పరిశోధన.

అది ఆవిడ అసలు పేరుకాదు. మాధవరావు పెట్టుకున్న ముద్దు పేరు. ఇంకోటి:

ఆవిడ అచ్చు తెలుగువాళ్ళలాగే, తెలుగు మాట్లాడేస్తుంది.

ఇంతకూ పాపం, శాస్త్రికి మిరాండాను చూడటమే పడలేదు. ఎత్తయిన హైహీల్స్ జోళ్ళతో, మోకాళ్ళవరకు ఫ్రాక్‌తో, మోకాళ్ళ

